

నవభూమి

జిల్లా అనుబంధం


09 జూన్ ,2025 సోమవారం పేజీలు:06

www.epaper.navabhoomi.in


## బోర్డు చూసి బోల్తా పడొద్దు!

# ప్రాణాలే పోతాయి!!

◆ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అస్పత్రులు



**జమీల్ అహ్మద్ / కొత్తగూడెం జూన్ 8 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెంలో కొత్త కొత్త అస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ, ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నాయి. కొన్ని ప్రైవేట్ అస్పత్రులు ప్రాణాలు తీసే ప్రయోగశాలలుగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రకరకాల మల్టీ స్పెషాలిటీ సేవలు అందిస్తున్నట్టు పెద్ద పెద్ద బోర్డులు దర్శనం ఇస్తాయి. లోపల సేవలు మాత్రం డొల్ల. ఆసుపత్రుల్లో సరైన వసతులు, పరికరాలు, తగిన అనుభవం ఉన్న వైద్యులు బోర్డుల్లో రాసిన సేవలకు సంబంధించిన వైద్యులు ఉండటం లేదు. పరికరాలు లేకున్నా అనుమతులు పొందుతూ ప్రజల ప్రాణాలను గాల్లో కలిపేస్తున్నారు. రికార్డులు మెయింటైన్ లేకుండా, ఆసుపత్రిలో వైద్యం చేసే వైద్యుడు ఎవరో అతన్ని విద్యార్హత, ధరల పట్టిక ఇటువంటివి కొన్ని ఆసుపత్రులలో కనపడడం లేదు. మరి కొన్ని మేనేజ్మెంట్ ఆసుపత్రులు పీఆర్వో, ఆర్ఎంపి వ్యవస్థల ద్వారా రోగులను ఆకర్షిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. తాజాగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం జరిగిన సంఘటన ఠాగూర్ సినిమాను గుర్తుకు తెచ్చింది.నడుము నొప్పికి ఆపరేషన్ చేస్తామని రోగిని నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉంచుకొని ఆసుపత్రిలో చనిపోయినప్పటికీ సీరియస్ గా ఉందంటూ ఖమ్మం తరలించి చేతులు దులుపుకున్నారు. అనంతరం బంధువుల ఆందోళనతో శవానికి వెలకట్టారని సమాచారం.ఇటువంటి వైద్యంతో ఇంకెంత మంది బలి కావాలి? ఆకర్షణీయమైన ప్రకటనలతో ఆకర్షిస్తూ అందిన కాడికి దండుకుంటూ వచ్చి రాని వైద్యం చేస్తూ ఆఖరికి శవానికి వెలకట్టె పరిస్థితి కొత్తగూడెంలో నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే మరిన్ని ప్రాణాలు గాల్లో కలుస్తాయి. లేదా ఇటువంటి ఆసుపత్రిలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కొత్తగూడెం జిల్లాలో వైద్య శాఖ అధికారుల పర్యవేక్షణ సరిగ్గ లేదన్న విమర్శలు ఉన్నాయి. అదనపు బాధ్యతలులేదా, ఇంచార్జి, లేదా రిటైర్మెంట్ కు దగ్గరున్న అధికార్లను డి ఎం హెచ్ ఓ గా నియమిస్తున్నారు. కొన్ని ప్రైవేట్ అస్పత్రుల వైద్యులు ప్రభుత్వ వైద్యులుగా పని చేస్తున్నారు. ఫలితంగా ఆ శాఖ పర్యవేక్షణ అధికార్లకు వీరికి మంచి సంబంధాలు ఉంటున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో లోనికి వెళితే ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరిగా ఉంటుంది. అద్దాల కేబిన్ లు, ఇరుకు గదులు ఇలా సాగుతున్నాయి ఆసుపత్రులు. వచ్చిరాని వైద్యం అయిన రోగిని జాయిన్ చేసుకున్న వెంటనే రూ 30 నుండి 50 వేల రూపాయల వరకూ కట్టించుకుంటున్నారు. అందిన కాడికి దండుకుంటున్నారు. ఆసుపత్రిలో ఏదైనా జరగరానిది జరిగితే పోలీసులు ఆసుపత్రిని రక్షించేందుకు వెంటనే రంగంలో దిగుతున్నారు. కొన్ని ఆసుపత్రులపై డి ఎం హెచ్ ఓ కు ఫిర్యాదులు వెళ్లినా విచారణ కొనసా...తూనే ఉంటుంది. కొన్ని ఆసుపత్రులపై పోలీసులకు ఫిర్యాదులు కూడా అందాయి. కొన్ని ఆసుపత్రులకు అంబులెన్సు వెళ్లే దారే లేనప్పటికి అధికార్లు చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. నామ మాత్రపు తనిఖీలు ఉంటున్నాయి. తనిఖీల్లో లోపాలు గుర్తించిన వైద్యఆరోగ్య శాఖ అధికారులు కొన్నిసార్లు గుర్తించిన లోపాలు, ఆసుపత్రి పేరు వెల్లడించడం లేదు. ఇప్పటికైనా అధికారులు సరైన పరికరాలు, తగిన అనుభవం ఉన్న వైద్యులు లేని ఆసుపత్రులు తనిఖీ చేసి వాటిని మూయించకపోతే జనంప్రాణాలు పోగొట్టుకుంటారు. వారిప్రణానికి చిల్లర విదిల్చి ఆసుపత్రి యాజమాన్యాలు చేతులు దులుపుకుంటాయి. ఆసుపత్రుల్లో వైద్యుల హక్కులు, దాడులు చేస్తే చట్టాలు, ఆయా సెక్షన్ లో అయ్యే కేసుల గురించి సమాచారం ఉంటుంది. ఆసుపత్రి లోపాలపై కూడా ఎవరికీ ఫిర్యాదు చేయాలో, రోగుల హక్కులేమిటో ఆయా అధికార్ల ఫోన్ నంబర్లు, మొత్తంగా ఓ టోల్ ఫ్రీ నెంబర్ అవసరమా కాదా..., ఈ విషయంలో కాస్త ఐ ఎం ఏ ఆలోచిస్తే బాగుంటుందేమో

## విద్యారంగ సమస్యలు

# పరిష్కారించాలి




## ఖమ్మం పెద్దాసుపత్రి

# కంపు కొడుతోంది !



**ఖమ్మం -నవభూమి:** 'రెక్కాడితే కానీ డొక్క నిండని నిరుపేద కార్మికులు.. వారిలో ఒంటరి మహిళలు సైతం ఉన్నారు.. రోజువారీగా మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్నప్పటికీ.. వార్డుల్లో చెత్తాచెదారం లేకుం డా పరిశు భ్రంగా ఉంచుతున్నప్పటికీ.. ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా మార్చినప్పటికీ ఆకలి కేకలు తప్పడం లేదు. నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ నెలవారీగా వేతనాలు చెల్లించేందుకు కాంగ్రెస్ సర్కారుకు చేతులు రావడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతన సమస్య మొదటికి వచ్చింది.స్థానిక వైద్యాధికారుల నిర్లక్ష్యమో, గుత్తేదారుడి అలసత్వమో వెరసి ప్రస్తుత నెలతో కలిపి నాలుగు నెలలుగా బడుగు జీవులు బుక్కెడు బువ్వ కోసం రోడ్లెక్కే పరిస్థితి దాపురించింది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. పేషెంట్ కేర్, గార్డెన్, శానిటేషన్ విభాగాల్లో పనిచేస్తున్న దాదాపు 259 మంది నెలవారీ వేతనం కోసం విధులు బహిష్కరించి ఆందోళనబాట పట్టారు. వారికి బీఆర్ఎస్, సీఐటీయూ, ఐఎఫ్టీయూ తదితర కార్మిక సంఘాలు బాసటగా నిలవడంతో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు తీర్మానించుకున్నారు. అంతా కలిసి శుక్రవారం దవాఖాన ఎదుట ధర్నాకు దిగారు. కాగా.. తాజా సమస్య కేవలం గత ఏడాదిన్నరగా ఉత్పన్నం కావడం గమనార్హం.కంపు కొడుతున్న దవాఖాన జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు వేతన బకాయిలు చెల్లించాలంటూ సమ్మెకు దిగారు. దీంతో శనివారం వైద్యసేవల నిమిత్తం వచ్చిన రోగులకు పట్టపగలే చుక్కలు కనిపించాయి. దవాఖానలో అడుగుపెడితే కడుపులో పేగులు బయటికి వచ్చేంత మురుగు కంపు స్వాగతం పలుకుతోంది. ఏ మూలనచూసినా వ్యర్థాల గుట్టలు దర్శనమిస్తున్నాయి. కనీసం మంచినీళ్లు కూడా దొరకని దుస్థితి నెలకొంది. వృద్ధులు, నడవలేని వారిని, ప్రసవం కోసం వచ్చే గర్భిణులను కనీసం స్ట్రెచర్తో లోపలికి తీసుకెళ్లే వారే కరువయ్యారు. రోగుల సహాయకులుగా వస్తున్న వారి కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్తున్న ఘటనలు హృదయ విదారకంగా దర్శనమిస్తున్నాయి.ఈ విషయంపై కాంగ్రెస్ సర్కారుకు చెందిన మంత్రులు, పెద్దలు పట్టించుకున్న పాపానపోవడం లేదు. స్థానిక గుత్తేదారు, వైద్యాధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటున్నరు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు రోజుకు రూ.వెయ్యి చెల్లించి ప్రైవేటు వ్యక్తులను తీసుకొచ్చి పారిశుధ్య పనులకు పురమాయించారు. కానీ.. బాత్రూములు, కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలు కుళ్లిన వాసన వస్తుండటంతో వారు కూడా తూతూమంత్రంగా తంతు ముగించారు.మంత్రులు వస్తున్నారని..తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఆందోళనకు దిగడం ఇదే మొదటిసారి కాదు. కేవలం నెలవారీ వేతనాలు చెల్లించండి మహాప్రభో అంటూ రోడ్డెక్కడం ఏడవ దఫా. గత మే నెలలో సైతం వారంతా ధర్నాకు దిగితే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జోక్యం చేసుకున్నారు. నాడు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఎలాగైనా సమ్మె విరమించేలా చూడాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు.తక్షణమే రంగంలోకి దిగిన యంత్రాంగం జిల్లా పరువు తీయవద్దని కార్మికులను బతిమాలుకున్నారు. తక్షణమే ఒక నెల వేతనం చెల్లించి, మిగతావి ఇరవై రోజుల్లో వచ్చేలా చూస్తామని నమ్మబలికారు. వారు అనుకున్న లక్ష్యం నెరవేరి అధికారిక కార్యక్రమం ముగిసిన తర్వాత ఇప్పుడేమో తమకేమీ సంబంధం లేనట్లుగా చేతులెత్తేశారు. దీంతో ఆగ్రహించిన వేతనజీవులు గత్యంతరం లేని పరిస్థితుల్లో మరోమారు సమ్మెకు పిలుపునిచ్చారు. 'మార్పు' అంటూ అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పెద్దలకు తమ వేతన సమస్య ఏమాత్రం పట్టింపులేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నేత్రదానం చేసిన వనమారెడ్డి భారతికి నివాళి



**సత్తుపల్లి, నవభూమి, జూన్ 8 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వనమారెడ్డి చెంచు రెడ్డి సతీమణి భారతి ఇటీవల మృతిచెందగా వారి నేత్రాలను లయన్స్ క్లబ్ సత్తుపల్లి ద్వారా ఖమ్మం నేత్రనిధికి దానం చేసారు.ఈ సందర్భంగా ఆదివారం సత్తుపల్లిలో జరిగిన భారతి సంతాప కార్యక్రమంలో టీఎస్ జిఆర్ఇఎ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య,రాష్ట్ర కార్యదర్శి పి.శరత్ బాబు పాల్గొని నివాళి ఘటించారు.నేత్రదానం చేయడం ద్వారా భారతి మరో ఇద్దరికి కంటి చూపు ప్రసాదించి తన జీవితాన్ని సార్ధకం చేసుకున్నారన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ద్వారా నేత్రదానం,అవయవ దానాలను చేసే దాతలను ప్రోత్సహిస్తున్నామన్నారు.ఈ సంతాప కార్యక్రమంలో టీఎస్ జిఆర్ఇ ఎ సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్,సంఘ నాయకులు రామిశెట్టి సుబ్బారావు,డి.కృష్ణయ్య, ప్రకాశరావు,మురళి, బోడేపూడి బాబు,దాసరి వెంకట్రామిరెడ్డి, పూర్ణచంద్రరావు, మధుసూదన రాజు తదితరాలు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రివర్గ విస్తరణతో బహిర్గతమౌతున్న అసంతృత్తులు

### అధికారులు రాజకీయ నేతల్లో పెరిగిన అవినీతి

### 19 నెలల పాలనలో అమలు గాని ఆరు గ్యారంటీలు :భీమిరెడ్డి పుల్లారెడ్డి



**సత్తుపల్లి, నవభూమి,జూన్ 8 :** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తి బహిర్గతమవుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంత్రివర్గంలో చోటు కోసం చాలామంది ఎదురుచూస్తున్నారని సుదీర్ఘకాలం నిరీక్షింప చేయటం వల్లనే అసంతృప్తి పెరిగిందని పుల్లారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అతి ప్రజాస్వామ్యం ఉంటుందన్నారు. దీనిని గమనించి ప్రారంభంలోనే మంత్రివర్గ కూర్పును పూర్తి చేస్తే బాగుండేది అన్నారు. ఆలస్యం కావడంతో వర్గాలు పెరిగాయన్నారు. ఈ అసంతృప్తి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం చూపుతుందన్నారు. అధికారులు అవినీతి పెరిగిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు కావాలంటే సామాన్యులు డబ్బులు ఇచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాలను రాజకీయ నాయకులు అవినీతి ఆరోపణ ఎదుర్కొంటున్నారన్నారు. పాత కాంగ్రెస్ నాయకులు పక్కకు వెళ్లిపోయారని పారాచూట్ నేతలదే పెత్తనం నడుస్తోందన్నారు. 19 నెలల పాలనలో ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకపోయారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాగ్దాన భంగం ప్రజలకు తేటతెల్లమైందన్నారు. సంక్షేమ పథకాలు చేసిన వాగ్దానం ప్రకారం అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో మరోసారి అధికారంలోకి రావడం కష్టమన్నారు. ఇప్పటికైనా ఎన్నికల హామీలను అమలు చేయడం ద్వారా ప్రజల మనస్సు గెలవాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తానని కొత్త నినాదం ఎత్తుకున్నారన్నారు. ఇది ఎలా సాధ్యమవుతుందో వివరించలేకపోతున్నారన్నారు. రైతు భరోసా పదిహేను వేలు ఇస్తానని వాగ్దానం చేసి ఇప్పటివరకు ఒకసారి కూడా ఇవ్వలేకపోయారన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా బీఆర్ఎస్ పార్టీ ఇవ్వలేకపోయినా రైతుబంధును ఎకరానికి ఐదు వేల చొప్పున ఇచ్చారన్నారు. కౌలు రైతుల ఊసు ఎత్తటం లేదు అన్నారు. వ్యవసాయ కూలీలకు ఇస్తానన్న పన్నెండు వేలు ఇవ్వలేకపోయారన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదు అన్నారు. గోదావరి జలాలను బనకచర్ల పేరుతో ఆంధ్ర జలదోపిడికి పాల్పడబోతోందన్నారు. దీనిని అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి కేంద్ర జల సంఘానికి లేఖ కూడా రాయలేకపోయారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు తక్షణమే రిపేర్లు చేపట్టాలన్నారు. గత వేసవిలో పంటలు కోల్పోయిన తెలంగాణ రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కాళేశ్వరంను రిపేర్ చేయడం ద్వారా రైతుల పంటలకు నష్టం కలగకుండా చూడాలన్నారు.

# గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు

- విశ్రాంత ఉద్యోగుల ప్రోత్సాహం మరువలేనిది
- కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రెహమాన్

**కొత్తగూడెం జూన్ 8 నవభూమి ప్రతినిధి:** జిల్లా గ్రంధాలయంలో సీనియర్ సిటిజన్స్ విద్యానగర్ కాలనీ ఆధ్వర్యంలో రూ.10 వేలు విలువ చేసే సాధారణ వేడి, చల్లని త్రాగునీరు అందించే వాటర్ కూలర్ ను జిల్లా గ్రంథాలయానికి డిఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో అందజేశారు. మోరంపూడి సునిల్ కుమార్ వారి తల్లిదండ్రులు రామ సత్యనారాయణ – తులసి జ్ఞాపకార్థం ఈ వాటర్ కూలర్ అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ చదువు జీవితాలను వెలిగించే చక్కటి దీపం అని, సామాన్య కుటుంబాన్ని సంపన్న కుటుంబంగా తీర్చిదిద్దుతుందన్నారు. కష్టపడి, ఇబ్బందులను ఓర్చుకుని మంచిగా చదువుకున్న వారు నేడు ఉన్నత స్థానాల్లో నిలిచారని చెప్పారు. నేటి రోజుల్లో చదువుకునేందుకు ప్రభుత్వాలు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాయని, కనీస మౌలిక సదుపాయాలు లేని రోజుల్లో వీధి దీపాలు కిరోసిన్ లాంతర్ల ముందు కూర్చుని చదువులు సాగించారని చెప్పుకొచ్చారు. విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదివిన నాడు లక్ష్యం సాకారం అవుతుంది, కృషి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు వంటివని, వాటిని సద్వినియోగం చేసుకొని మంచి వాతావరణంలో చదువుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు సదుపాయాలు కల్పిస్తుందని, మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విశ్రాంత ఉద్యోగులు తమకు వచ్చే నెలవారి పింఛన్లలో మంచి సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రంథాలయాల్లో ఉన్న అవసరాలను గుర్తించి వాటిని సమకూర్చేందుకు ముందుకు రావడం గర్వకారణం అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బ్రతుకులను బంగారుమయంగా మలుచుకోవాలని, మన ప్రవర్తన ఆధారంగానే జీవితాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని చెప్పారు. బి. కేశవరావు వందన సమర్పణ చేయగా, ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు జి మణి మృదుల, సీనియర్ సిటిజెన్ ప్రెసిడెంట్ కొల్లు నాగేశ్వరరావు, సెక్రటరీ సురేష్ కుమార్, శివరామకృష్ణ, ధర్మారావు, కామేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్, సామ్యూల్, జోసెఫ్, మైనేని నాగేశ్వరరావు, బసవయ్య, గురుమూర్తి, అంజనానందం, తోట సమ్మయ్య, చెన్నంరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు







# విద్యారంగ సమస్యలు పరిష్కారించాలి

- పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు

**ఖమ్మం జూన్ 8 నవభూమి ప్రతినిధి:** 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపద్యంలో పాలకులు ఐదేళ్లకు ఒకసారి మారుతున్న విద్య వ్యవస్థ మాత్రం రోజురోజుకు కుంటు పడుతుందని జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు మందా సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఖమ్మం జిల్లా కేంద్రం లెనిన్ నగర్ జార్జిరెడ్డి కార్యాలయంలో జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశంలో సురేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో గత ఏడాది ఖమ్మం జిల్లాలో 49 ప్రైమరీ పాఠశాలు జీరో అడ్మిషన్స్ తో మూతపడ్డాయని, ఈ విద్యా సంవత్సరం జీరో బడులు సంఖ్య పెరిగే ప్రమాదపు అంచున ఉండే పాఠశాలలు ఒక వైపు ఉంటే మరో వైపు పర్మిషన్స్ లేకుండా, ప్రైమరీ పర్మిషన్స్ తో హైస్కూల్ బోర్డులు పెడుతూ పుట్టగొడుగుల ప్రైవేట్, కార్పొరేటర్ విద్యాసంస్థలు పుట్టుకోస్తుంటే, అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి పర్యవేక్షణ మరిచి, విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు నిర్వహిస్తున్న, ఇప్పటికే లిమిటెడ్ సీట్లు అని, అడ్మిషన్స్ క్లోజ్ అని బోర్డులు పెడుతున్న, ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు వాటిని కట్టడి చేయకుండా ప్రైవేట్, కార్పొరేటు వ్యవస్థకు ఊడిగం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికే విద్యార్థులందరూ ప్రైవేట్ కార్పొరేటు, గురుకులాలకి అడ్మిషన్లు అయిన తరువాత వారం రోజులపాటు బడిబాట అంటు పరిగ వేరుకునే విధంగా ప్రభుత్వ విద్యా సంస్థను కాపాడుకుందాం అనే నినాదంతో కాలయాపన చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఎందరు మారినా ప్రభుత్వ స్కూళ్లలో సమస్యలతో విద్యా సంవత్సరాన్ని ప్రారంభించే పరిస్థితి ఉందని ప్రభుత్వాన్ని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్స్ నుండి మొదలుకొని అనేక మౌలిక సదుపాయాలు లేక, శిధిలావస్థలో ఉన్న బిల్డింగ్స్ విద్యార్థులను నీడలా వెంటాడుతున్నా ప్రభుత్వాలకు నిమ్మకు నీరెత్తినట్టు వ్యహరిస్తున్నాయి. ఏడుపదులు దాటిన స్వతంత్ర భారతంలో ఆడపిల్లలకి టాయిలెట్స్ లేక చున్నీలు అడ్డు పెట్టుకొనే దౌర్భాగ్య పరిస్థితి ఉన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుండా ప్రైవేటు, కార్పోరేట్ కాలేజ్ లు సేమ్ ర్యాంకుల పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తున్న, ఒక బిల్డింగ్ పర్మిషన్స్ తో రెండు మూడు బిల్డింగ్స్ లో హాస్టల్ పేరుతో క్లాసులు నడిపిస్తున్న ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకే అధికారులు కాసులకు కక్కుర్తి పడి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేయాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్, రియంబర్స్మెంట్ రూ.8000 వేల కోట్లు ఫీజు బకాయాలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ ఎంసెట్ కౌన్సిలింగ్ పూర్తిగా కాకుండానే డొనేషన్ల పేరుతో ఇష్టం వచ్చినట్టు ఫీజులు పెంచుకొని ఇంజనీరింగ్ విద్యను సామాన్యుడికి అందని ద్రాక్ష లాగా తయారు చేస్తున్నారని, ప్రభుత్వమే ప్రైవేట్ కార్పొరేటు విద్య వ్యవస్థకు రెడ్ కార్పెట్ పరుస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలకు సొంత బిల్డింగ్స్ లేక, అద్దె భవనాలలో సరైన సదుపాయాలు లేక, అద్దెలు చెల్లించక, వానొస్తే వలవల అంటూ గురుకులాలు సమస్యలతో విద్యా సంవత్సరం స్వాగతం పలికేలా ఉందని విద్యా వ్యవస్థ పట్ల పాలకుల విధానం తీరు మారట్లేదని మండిపడ్డారు.అందుకే జార్జి రెడ్డి పి డి ఎస్ యు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, పాలకులు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జరిగే పోరాటాల్లో విద్యార్థులు భాగస్వామ్యం ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు రాచకొండ ఉదయ్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఫైండ్ల శ్యామల, నాయకులు శ్రావణి, శ్రీధర్, సాయి, అశోక్, పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.



# 27న 5 పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సు ఏర్పాటు

## సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి



**సత్తుపల్లి, నవభూమి, జూన్ 8 :** జూన్ 27న సత్తుపల్లి నుండి 5 పుణ్యక్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక డీలక్స్ బస్సు ను నడుపుతున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు సత్తుపల్లి నుండి డీలక్స్ బస్సు బయలుదేరి ఐదు పుణ్యక్షేత్రాలను దర్శింపచేసుకుని అదే రోజు రాత్రి 10 గంటలకు తిరిగి సత్తుపల్లి చేరుకుంటుందన్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయం, తరువాత ద్రాక్షారామంలో వెలసిన భీమేశ్వర స్వామి ఆలయం, కోనసీమ తిరుపతిగా పేరుందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం,పెనుగొండలోని కన్యకా పరమేశ్వర మాత ఆలయం చివరిగా చిన్న తిరుపతిగా పేరుందిన దివ్య పుణ్యక్షేత్రం ద్వారక తిరుమల దర్శింప చేయనున్నట్లు ఆమె వివరించారు .ఈ ఐదు పుణ్యక్షేత్రాలు దర్శించుకునేందుకు డీలక్స్ బస్సు చార్జీ పెద్దలకు వెయ్యి రూపాయలుగా, పిల్లలకు ఏడు వందల రూపాయలుగా నిర్ణయించామన్నారు. ముందుగా బస్ టికెట్ రిజర్వ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. దేవాలయాలలోని ఇతర టికెట్లు,ఖర్చులు భక్తులే భరించాలన్నారు. మరిన్ని వివరాలకు 9866619189, 9542698518 ఫోన్ నెంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు.సత్తుపల్లి డిపో పరిధిలోని భక్తులందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యు .రాజ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్రెడ్డి

**తిరుమలయపాలెం నవభూమి జూన్ 08** తిరుమలాయపాలెం మండలం లో ఆదివారం పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్రెడ్డి పలు గ్రామాలలో వివాహ వివాహవేడుకలు కార్యక్రమాలలో పాల్గొన్నారు తాళ్ళచెరువు .మేకలతండా. సుబ్లేడ్ క్లాస్ హైదర్ సాయిపేట. సుద్దవాగుతండా వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించినారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ తిరుమలయపాలెం మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న. పార్టీ ప్రధాన కార్యదర్శి దేవవరం దేవేందర్ రెడ్డి.%ఎతీం% పార్టీ మండలఉపాధ్యక్షులు బానోత్ రవి ఆర్మీ. చంద్రు తండా మాజీ సర్పంచ్ బోడా మంచా నాయక్. బిఆర్ఎస్ నాయకులు స్టాలిన్ రెడ్డి. కీసర సంగీత్ రెడ్డి వీరన్న రాంబాబు సర్పంచ్ హైమావతి. భావ్ సింగ్. ఎస్. కె పాషా. పచ్చ నాయక్ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు .బొల్లికొండ రమేష్ జూపెడ గ్రామ శాఖ. లక్ష్మయ్య మాజీ ఉపసర్పంచ్ .వస్పొంగు మల్లయ్య. ఇంకా మరికొందరు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కందాల గారి అభిమానులు . బంధుమిత్రులు తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించినారు





## సుబ్లేడ్ గ్రామానికి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మంజూరు

# శంకుస్థాపన చేసిన నరేష్ రెడ్డి

- రెండుకోట్ల 70లక్షలు వ్యయంతో నిర్మించనున్న హాస్టల్‌భవనాలు
- మండల ప్రజల కోరిక తీర్చిన నరేష్ రెడ్డి
- మంత్రి కృషితో మంజూరైన ఇంటిగ్రేటెడ్ హాస్టల్







**తిరుమలాయపాలెం నవభూమి జూన్ 07** మండల ప్రజల చిరస్థాయి కోరిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మండలానికి కావాలనే దృఢ సంకల్పంతో అనేక మార్లు పాలకులకు విద్యార్థి సంఘాల నాయకులు విద్యావంతులు అనేక విధాలుగా విన్నవించిన ఆ కార్యక్రమం కార్యరూపం దాల్చలేదు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కృషితో గ్రామంలో రెండు కోట్ల 70 లక్షల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాలు మంజూరయ్యాయి శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బి రామసహాయం నరేష్ రెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఈ హాస్టల్ ఉంటుందని ఆయన తెలిపారు సకల సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని దృఢ సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో అనేకమార్లు విన్నవించి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ని మంజూరు చేయించుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మండల ప్రజల తరఫున సుబ్లేడ్ గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఈ ఈ విన్సెంట్ రావు ఏఈ సత్యనారాయణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ బత్తుల వెంకటనారాయణ మాజీ వార్డ్ మెంబర్ గుంజ ఎలమంద గంగ సిరి నవీన్ బోడ రమేష్ గంటా సైదులు తదితరులు పాల్గొన్నారు

# రేపు సిపిఐ పాల్వంచ మండల 19వ మహాసభ

- పేదలు, కష్ట జీవులు, కార్మికుల పార్టీ సిపిఐ
- ప్రజాబలంతోనే వందేళ్లు మనగలిగాం



**పాల్వంచ టౌన్ జూన్ 8 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో జరగనున్న సీపీఐ పాల్వంచ మండల 19వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. ఆదివారం మహాసభ ప్రాంగణంలో ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలందించేందుకు పురుడుపోసుకున్న పార్టీకి ప్రతినిధులుగా పనిచేయడం అదృష్టంగా కార్యకర్తలు భావించాలన్నారు. పాల్వంచ మండలంలో సిపిఐకి ఎదురులేదని, ఇది ప్రజలకు అందించిన సేవల ఫలితమేనన్నారు. జూన్ 10న పాండురంగాపురం గ్రామంలో ప్రదర్శన నిర్వహించి మహాసభ నిర్వహించనున్నట్లు, ఈ మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా, అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పార్టీ, ప్రజాసంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. మండల పరిధిలోనీ ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని మండల మహాసభను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి గుండాల నాగరాజు, ఆహ్వాన సంఘం నాయకులు మన్నెం వెంకటేశ్వరరావు, ఇరుకులపటి సుధాకర్, ఆడపు పెద్ద వెంకటరామయ్య, కోటి నాగేశ్వరరావు, బుచ్చయ్య, కొత్త సురేష్, కోటి తిరుపతయ్య, బందారి నాగేశ్వరరావు, నెల్లూరు సతీష్, ఎర్రగడ్డ ప్రభాకర్, పూసల రాంబాబు, జక్కుల సురేష్, భూక్య రమేష్, బానోత్ భరత్, ఈర్ల ఆనంద్, వట్టి కొండ మేరమ్మ, గుగులోత్ శాంతి, ఇట్టబోయిన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులుగా పసుమర్తి



**కల్లూరు, నవభూమి, జూన్ 8:** ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం, ఆదివారం కల్లూరులో ఓ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఆర్యవైశ్య జిల్లా మహాసభ అధ్యక్షులుగా కల్లూరుకు చెందిన పసుమర్తి చందర్రావు, ప్రధాన కార్యదర్శిగా వనమా కిరణ్ కుమార్, గొల్ల రాధాకృష్ణమూర్తి, కోశాధికారి పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రచార కార్యదర్శి కొప్పురపు బలరామ్, కార్యనిర్వాహక కార్యదర్శి పాలువాయి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగిశెట్టి గంగాధర జగదీష్ కుమార్, నాకు బండి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా నూకల శ్రీనివాసరావు, వీరవల్లి రాజేష్ తో పాటు పలువురు సభ్యులు ఎన్నిక కాగా, ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చందర్రావు మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్తా , ఆర్యవైశ్య కార్పొరేషన్ తెలంగాణ మహిళా అధ్యక్షులు ఉప్పల శారద, రాష్ట్ర, జిల్లా, మండలాల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఎన్నికైన సభ్యులను పలువురు ప్రముఖులు అభినందించారు.

## కొత్తపాలెంలో ఘనంగా గంగానమ్మ జాతర



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్8:** మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో వేంచేసి ఉన్నగంగానమ్మ తల్లి జాతర ఆలయ చైర్మన్,ఆలయ ఫౌండర్ జానకిశివయ్య, గ్రామప్రజలసహకారంతోఆదివారంఘనం గా నిర్వహించారు.గంగానమ్మ జాతర సందర్భంగా గ్రామస్తులు ఉదయం10 గంటలనుండి అమ్మవారికి జలాభిషేకం ఘనంగా నిర్వహించారు.ఆలయ పూజారి శివ కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఉదయం 11 గంటల నుండి మహిళలు మంగళ వాయిద్యాల నడుమ పసుపు,కుంకుమ, పూలు,పండ్లు,పొంగళ్ళుచేసిబోనాలను తలపైఎత్తుకొనిఅమ్మవారికిసమర్పించారు.ఎటువంటితొక్కిసలాట లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జానకియాకయ్య,సూరంశెట్టిభాస్కర రావు ,గ్రామ ప్రజలు,వివిధ గ్రామాల భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## మైనార్టీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### కేబినెట్‌లో మైనార్టీలకు మొండిచేయి

### మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం మైనార్టీ మంత్రిని నియమించాలి:

### మైనార్టీ జిల్లా అధ్యక్షులు యాకూబ్ పాషా



**పాల్వంచ జూన్ 8 నవభూమి ప్రతినిది:** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్ లో మైనారిటీలకు మంత్రి పదవి కెటాయించకుండా మొండిచేయి చూపించిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మైనారిటీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. మైనారిటీ మంత్రి లేని కారణంగా గత కొన్ని నెలలు గా అనేక మైనారిటీ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ గురుకులాలు ఇరుకైన కిరాయి భవనాల్లో, అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయని, ఇప్పటివరకు మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు కానీ, మైనారిటీ స్టడీ సర్కిల్లు లేవని అన్నారు. అలాగే వక్ఫ్ భూముల సర్వే, వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి వక్ఫ్ బోర్డు, మైనారిటీ సంక్షేమ శాఖలలో ఉద్యోగ నియామకాలు జరగలేదని, గత ప్రభుత్వం ఉర్దూ మీడియం స్కూళ్లను ఇంగ్లీష్ మీడియంగా మార్చి ఉర్దూ భాషను కనుమరుగు చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని, ఈ చిన్నచూపు తగదని హితవు పలికారు. ఓసిలు 6, ఎస్సీలు 4, బీసీలు 3, ఎస్టీల నుండి ఒకరిని మంత్రి వర్గంలోకి తీసుకున్న ముఖ్యమంత్రికి మైనార్టీల నుండి ఒక్కరూ కనిపించకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు కోసం మాత్రమే ఉపయోగించుకుంటున్న కాంగ్రెస్ అదిష్టానం ఆలోచనా సరళిని మార్చుకోవాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి త్వరలో జరగనున్న క్యాబినెట్ విస్తరణలో మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలని, లేని మైనార్టీల నుండి తీవ్ర వ్యతిరేఖతను ముఖ్యమంత్రి మూట కట్టుకోవటం ఖాయమన్నారు. మైనారిటీల నుండి మంత్రి లేకపోవటంతో మైనారిటీల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి,అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని యాకూబ్ పాషా ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో హుస్సేన్ ఖాన్, సలీం, గౌస్ పాల్గొన్నారు.

## మాంటిస్సోరి నూతన భవనాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం

◆ రిసెప్షన్ కౌంటర్‌ని ప్రారంభించిన మాజీ మున్సిపల్ చైర్మన్ డీవీ









**ఇల్లెందు జూన్ 8 నవభూమి ప్రతినిధి:** గత మూడు దశాబ్దాలకు పైగా ఇల్లెందు ఏరియాలో విద్యారంగ సేవలను అందిస్తున్న మాంటిస్సోరి హైస్కూల్ నూతన భవన ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నూతన భవనాన్ని ప్రారంభించారు. ఇల్లెందు ఏరియా ప్రజలు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు దూర ప్రాంతాలకు వెళ్ళకుండా ఇల్లెందులోనే మంచి నాణ్యమైన విద్యను అందిస్తున్న మాంటిస్సోరి హైస్కూల్ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య అభినందించారు. ఉద్యోగం కోసమే చదువుకాదని, ప్రతి ఒక్కరూ తమ కాళ్ళమీద తాము నిలబడేందుకు, ఉపాధి మార్గాలకు దిక్సూచిలా విద్య ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మరో ముఖ్య అతిథి, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు రిసెప్షన్ కౌంటర్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాంటిస్సోరి హైస్కూల్ యాజమాన్యాన్ని డీవీ అభినందించారు. నల్ల బంగారం లాంటి సింగరేణి కాలరీస్ ఏరియాలోని పిల్లలను మేలిమి బంగారంలా తయారు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరి హైస్కూల్ ఫౌండర్ చైర్మన్ జోస్ నెడుంతుండం, మాంటిస్సోరి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ టి. సుధాకర్, డైరెక్టర్ డాక్టర్ టి. భార్గవ్, ప్రిన్సిపాల్ బిజ్జు, ఇల్లెందు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు నామా సుధాకర్, అర్వపల్లి రాధాకృష్ణ, జక్కుల సర్వేశ్వరరావు, ప్రియదర్శిని మహేందర్, ఒంగూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అభయాంజనేయ స్వామి

# విగ్రహ ప్రతిష్ట మహొత్సవం





**పాల్వంచ టౌన్ జూన్ 8 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహొత్సవములు ఘనంగా నిర్వహించారు పాల్వంచకు చెందిన పేరు అందిన పురోహితులు శ్రీమాన్ కందాల సింహాద్రి ఆనందకుమారాచార్యులు ఆధ్వర్యంలో శుక్ర శనివారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం విగ్రహ ప్రతిష్టతో పాటు ప్రాణ ప్రతిష్ట, ప్రాణాది దశ వాయున్యాసములు, నేత్రోన్మేళనము వంటి పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొత్వాల ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సుమారు 5000 మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని కొత్వాల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు అజ్మీర జగదీష్, బానోతు లక్ పతి, భానోత్ కుమార్, వాంకుడోత్ చిన్న వీరు, ఇస్లావత్ లాలు, గుగులోతు కిషోర్, బానోత్ ప్రసాద్, ఇస్లావత్ దేవి, మార్గం అంకయ్య, మాజీ జడ్పిటిసి సభ్యులు ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, ఎర్రంశెట్టి మధుసూదన్ రావు, పాకలపాటి రోశయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే

**ములకలపల్లి జూన్ 8 నవభూమి:** మండలంలో పాలవాగు గ్రామంలో ముత్యాలమ్మ,పోతురాజుల విగ్రహ ప్రతిష్టా మహొత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు కలిసి ఎమ్మెల్యేను సన్మానించడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలో గద్దే బుచ్చిబాబు, అరుణ దంపతుల మనవరాళ్లు మనస్వి – కనిస్క ల ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కమలాపురం గ్రామంలో గుజ్జుల వారి వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ జెడ్పిటిసి బత్తుల అంజి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, మాజీ సర్పంచ్ కారం సుధీర్, గుంపుల రవితేజ, శనగపాటి రవి మరియు మండల కాంగ్రెస్ నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కాలువలో పడి 2 ఎడ్లు మృతి



**గుండాల జూన్ 8 నవభూమి:** గుండాల మండలం సాయనపల్లిలో బి ఎస్ ఎన్ ఎల్ లైన్ కోసం తవ్విన కాలువలో పడి రెండు ఎడ్లు, రెండు మేకలు మృతి చెందిన ఘటన సాయనపల్లి లో జరిగింది. రెండు ఎడ్లు విలువ సుమారుగా రెండు లక్షలు ఉంటుందని రైతు వీరస్వామి తెలిపారు. బి ఎస్ ఎన్ ఎల్ లైన్ దానిని పూడ్చకుండా అలాగే ఉండటం మూలంగా ఎన్నో మూగజీవులు మృత్యువాత పడుతున్నాయిని రైతులు ఆరోపించారు. బి ఎస్ ఎన్ ఎల్ లైన్ కోసం తవ్విన కాలువ చేపట్టిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, కాలువ తక్షణమే పూడ్చాలని, ఎడ్లు చనిపోయిన రైతుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

## నూరు వసంతాల యోధుడికి ఘన సన్మానం



**గార్ల, నవభూమి, జూన్ 8:** నూరు వసంతాలు పూర్తి చేసుకున్న స్వాతంత్ర్య సమర యోధుడు, భారత కమ్యూనిస్టు నాయకుడు తోడేటి కొమరయ్య కు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యుడు కోరం కనకయ్య, స్థానిక ప్రముఖులు, పలు రాజకీయ పక్షాల నాయకులు, కుటుంబ సభ్యులు ఆదివారం గార్ల లో ఘనంగా సన్మానించారు. స్థానిక వర్తక సంఘం భవనం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేశ స్వాతంత్ర్య సమరం లో కొమరయ్య పాల్గొన్న ఘట్టాలు, కమ్యూనిస్టు నాయకుడు గా సాగించిన పోరాటాల పటిమలను ఎమ్మెల్యే కనకయ్య తో పాటు పలువురు వివరించారు. తొలుత ఏర్పాటు చేసిన బర్త్ డే కేక్ ను కొమరయ్య కత్తిరించి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గార్ల మండల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పక్షాల నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**గార్ల, నవభూమి, జూన్ 8:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ ఆదివారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల ప్రారంభం అవుతున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కొరవడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాల ప్రారంభం లోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించి పాఠశాల ల్లో మంచినీటి సౌకర్యం, యూనిఫామ్స్, విద్యార్థులకు సరిపడా మలమూత్ర శాలలు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణం చేయించాలని కోరారు.మనఊరు-మనబడి కార్యక్రమంలో పెండింగులో ఉన్న పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా వ్యాప్తంగా 167 ప్రభుత్వ పాఠశాలలను మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి కృషి చేయాలని కోరారు. విద్యా రంగ అభివృద్ధికి బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయించాలని లోకేష్ డిమాండ్ చేశారు.

### అసమానతలులేని సమాజ నిర్మాణమే

# కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం

- ఆపరేషన్ కాగార్‌తో ప్రజలనుంచి ఎర్రజెండాను దూరం చేయలేరు
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా





**కొత్తగూడెం జూన్ 8 నవభూమి ప్రతినిధి:** దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నంది పలికి ఆధునికతవైపు నడిపించింది ఎర్ర జెండానేనని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. రాష్ట్ర వ్యాపిత జరుగుతున్న మహాసభల్లో భాగంగా ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని మైలారం, బంగారుచెలక, చింతకుంట, పూనుకుడుచెలక, లక్ష్మీపురం, బొజ్జలగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని 31 గ్రామశాఖల సంయుక్త మహాసభ తిప్పగుట్ట గ్రామంలో జరిగింది. మహాసభ సందర్భంగా గ్రామంలోని వీధిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసిన మహాసభను సాబీర్ పాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ఉమ్మడి బంగారుచెలక, మైలారం గ్రామపంచాయతీ పరిధిలో పేదల పక్షాన నిలబడి అనేక భూపోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించి వేలాది ఎకరాలను పేదలకు పంచి బతుకు దారి చూపిందని, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషిచేసిందని, ఆ పోరాటాల ఫలితంగానే గ్రామీణ జనం కమ్యూనిస్టు పార్టీకి బలమయ్యారన్నారు. ఇక్కడి ప్రజలను చైతన్యవంతం చేసి ప్రశ్నించే, ఎదురించే, పోరాడే తత్వాన్ని నేర్పిందని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు లేకుండా చేయాలని కుట్రలు చేసిన వారిని ఇండ్లకే పరిమితం చేసిన పోరాట పటిమా ఈ ప్రాంత గ్రామీణ ప్రజలదని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కేంద్రంలోని మోడీషా ద్వయం కలలు కంటోందని, ఎర్ర జెండాను, కమ్యూనిజాన్ని ప్రజల నుంచి దూరం చేయలేరన్నారు. మావోయిస్టులను, కమ్యూనిస్టులను లేకుండా మోయాలనుకోవడం వారి అవివేకమని, ఆపరేషన్ కగార్ చర్యలకు స్వస్తి చెప్పి ప్రజలకు కావాల్సిందేంటో గుర్తించి వాటిని ప్రజల ధరించేందుకు కేంద్రం పూనుకోవాలని సూచించారు. అనంతరం 31 గ్రామాల నూతన కమిటీలను పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మీపతి, నాయకులు నూనావత్ గోవిందు, కంటెం సత్యనారాయణ, దారా శ్రీనివాసరావు, జోగా రామయ్య, సపావట్ రవి, బానోత్ నెహ్రు, జర్పుల ఉపేందర్, పరిపర్తి రాజు, జోగా రాజబాబు, కోడి లింగయ్య, జలీల్ పాషా, శర్వన్, జనార్ధన్, లాలూ, లక్ష్మీనారాయణ, వరుస రామస్వామి, ముత్తయ్య, మోహన్, శంకర్, గోపాల్, జానయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- టోర్నమెంట్ ప్రారంభించిన డిఎస్పి రెహమాన్

**కొత్తగూడెం జూన్ 8 నవభూమి ప్రతినిధి:** క్రికెట్ సమ్మర్ క్యాంపు ముగిసిన నేపథ్యంలో బాల, బాలికలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన క్రీడల అధికారి పరందామ రెడ్డి నేతృత్వంలో డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ బి కే డి సి ఏ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురంలో బీకేసీఏ గ్రౌండ్ లో లిటిల్ చాలెంజర్స్ సూపర్ నాకౌట్స్ ట్రోఫీ 2025 ఆదివారం ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ను డిఎస్పి అబ్దుల్ రెహమాన్ ప్రారంభించారు.డిఎస్పి మాట్లాడుతూ బాలబాలికల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని, నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు.ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని క్రీడా రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, క్రీడాకారులకు కావాల్సిన మరింత మౌలిక సదుపాయాలను అందిస్తే వారి ప్రతిభను వెలికి తీయవచ్చని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడా రంగాల్లో ప్రోత్సహించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా బాధ్యత వహించాలని సూచించారు. ఇటీవల కాలంలో క్రికెట్ కి మరింత క్రేజ్ పెరుగుతుందని ఇందులో భాగంగా చిన్నారులకు ఒక ప్రత్యేకమైన టోర్నమెంట్ నిర్వహించాలనే ఆలోచన రావడం హర్షనీయమని అన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు శ్రీకారం చుట్టిన క్రికెట్ కోచ్ పంతంగి సాయి నిరంజన్ ను ఆయన అభినందించారు. అనంతరం టాస్ వేసి మొదటి మ్యాచ్ ని ప్రారంభించారు. నీ టోర్నమెంట్ లో భాగంగా రెడ్ స్మాషర్స్ వర్సెస్ విక్టరీ వైలెట్స్ మధ్య హెూరాహెూరీగా పోరు జరిగింది. రెండు జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ భరితమైన మ్యాచ్ లో విక్టరీ వైలెట్ జట్టు విజయాన్ని సాధించింది.అనంతరం జరిగిన 2వ మ్యాచ్ ను బి కే డి సి ఏ ఉపాధ్యక్షులు డాక్టర్ బి.ఎస్.రావు వేసి ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ కి ఎస్సై రమణారెడ్డి, డాక్టర్ బి.ఎస్.రావులు క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించారు. ఈ టోర్నమెంట్లో మొత్తం 12 టీంలు పాల్గొనలు ఉన్నాయి.ఇందులో 6%-%6 టీములను గ్రూప్ %-% ఏ, గ్రూపు %-% బి గా విభజించి మ్యాచ్లను నిర్వహించడం జరుగుతుంది. ఈ టీములలో అండర్ %-%10, అండర్%-%14, అండర్ %-%19 జట్ల వారీగా పోటీలను ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి మండలం ఎస్సైలు జి రమణారెడ్డి, విజయసింహా రెడ్డి, ఆర్ఎస్ఐలు జగన్,ఓం ప్రకాష్, అసిస్టెంట్ కోచ్ లు మార్గం నరేందర్, బోయిని ప్రసాద్, కే లోకేష్, పదిరే నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కామేపల్లి మండల బిజెపి గిరిజన మోర్చా

### అధ్యక్షులుగా బాదావత్ రాజేష్



**కామేపల్లి, నవభూమి,జూన్ 8 :** కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన బాదావత్ రాజేష్ బిజెపి గిరిజన మోర్చా మండల అధ్యక్షులుగా నియమితుల య్యారు.ఆదివారం మండల పార్టీ అధ్య క్షులు జర్పుల రామారావు నియామకపు పత్రాన్ని మండల కేంద్రమైన కామేపల్లిలో రాజేష్ కు అందజేశారు.గిరిజన మోర్చా మండల అధ్యక్షులుగా నియమితులైన రాజేష్ ను గిరిజన మోర్చా రాష్ట్ర నాయ కులు భూక్య శ్రీను నాయక్, పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోలూరి రామచం ద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి జర్పుల కృష్ణ,ధరావత్ బాలకృష్ణ, వీరబోయిన మందార్ అభినందించారు.గిరిజన మో ర్చా మండల అధ్యక్షులుగా తనను నియ మించినందుకు రాజేష్ మండల పార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గిరిజన మో ర్చ అభివృద్ధికి,గిరిజనుల సమస్యల పరి ష్కారానికి, పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా రాజేష్ స్పష్టం చేశారు.

# సురక్షితమైన ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించడం ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**దమ్మపేట జూన్ 8 నవభూమి ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామాన్ని స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. నాణ్యతగా వేగంగా పనులు కొనసాగించాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. ప్రతి ఇంటి నిర్మాణంలో నాణ్యత అత్యవసరమన్నారు. ప్రభుత్వ లక్ష్యం ప్రతి అర్హుడికి సురక్షితమైన నివాసం కల్పించడమని ఆ లక్ష్యం నెరవేరే క్రమంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

# బడిబాట కరపత్రాలతో ప్రచారం

**అశ్వారావుపేట రూరల్ జూన్ 8 నవభూమి:**అశ్వారావుపేట కాంప్లెక్సు పరిధిలోని వివిధ పాఠశాలల హ్యాబిటేషన్లలో ఉపాధ్యాయులు బడిబాట కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి 5 సంవత్సరాలు దాటిన పిల్లల జాబితాలను సేకరించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే కలిగే ప్రయోజనాలను వివరించారు. తెలంగాణా ప్రభుత్వం విద్యార్ధులకోసం ఎంతో ఖర్చుచేస్తుందని అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని అమ్మ దర్శ పాఠశాల కమిటిలద్వారా అవసరమైన సదుపాయాలను విద్యార్ధులకు అందిస్తుందని వివరించారు. నందమూరినగర్ లో జరుగుతున్న ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని సి.ఆర్.పి ప్రభాకరాచార్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యయులు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# మున్నేరు కట్టు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కనకయ్య

**గార్ల, నవభూమి, జూన్ 8:** గార్ల మండలానికి సాగు నీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో మండలం పరిధిలోని ముల్కనూరు సమీపంలోని పాకాల ఏరు, అలుగేరు సంగమం వద్ద కట్టు నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం గుంపెళ్ళగూడెం సమీపంలో అలిగేరు పై నిర్మించిన కట్టును సహితం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ పాకాల ఏరు, అలిగేరు నుంచి వృధాగా పోతున్న నీటిని వినియోగం లోకి తేవాలనే సదుద్దేశంతో ఆనకట్టల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, గార్ల పెద్ద చెరువు తో పాటు పెద్ద చెరువు కు అనుసంధానం ఉన్న చెరువు లకు సాగు నీరు అందించేందుకు ఎత్తిపోతల పథకం నిర్మించ తలపెట్టిందన్నారు. ఈ విషయం పై సాగు నీటి కోసం ప్రతి ఏడాది పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కనకయ్య, నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి రైతులు తీసుకెళ్ళారు. సీతారామ ప్రాజెక్టు, శ్రీ రాం సాగర్ ప్రాజెక్టు కాల్వలను గార్ల మండలం పరిధిలోని చెరువులకు అనుసంధానం చేయాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కనకయ్య, నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు కాల్వల నిర్మాణం, ఎత్తి పోతుల పథకం నిర్మించడం పై పూర్తి స్థాయి నివేదిక ను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ



కార్యక్రమంలో గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, గార్ల మాజీ ఎంపీపీ మాలోతు వెంకట్ లాల్, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు దనియాకుల రామారావు, ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అందనాల రాజీవ్ నాయుడు, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్యా అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట శ్రీనివాస్, జాస్తి సత్య నారాయణ, జాస్తి సాగర్ బాబు, ఎద్దు లక్ష్మయ్య, గంగా వత్ రాం సింగ్, పాల్తీయ కిషన్, హతీరాం, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జూలురుపాడులో కొనసాగుతున్న గాలివాన

◆ **గాలికి లేచిన ఇంటిపై కప్పులు,కూలిన చెట్లు**



**జూలురుపాడు, జూన్ 08 (నవభూమి ప్రతినిధి)** మండలంలో శనివారం సృష్టించిన గాలి వాన భీభత్సం నుంచి వీరభద్రాపురం,సూరారం,న్యూ కాలనీ బాధితులు కొలుకోముందే తిరిగి అదేస్థాయిలో ఆదివారం మధ్యాహ్నం మొదలైన భీకర గాలి వానకు ఖమ్మం కొత్తగూడెం ప్రధాన రహదారిలో పత్తి మార్కెట్ యార్డ్ సమీపంలో చెట్లు కూలి రోడ్డుకు అడ్డంగా పడి వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.వాహనాలు బారులు తీరాయి.జోరు వానలో పోలీస్ సిబ్బంది శ్రమించి చెట్ల కొమ్మలు తొలిగించి ట్రాఫిక్ ను పునరుద్ధరించారు.గుండ్లరేవు గ్రామంలో గాలి ఉధృతికి రేకులఇల్లు పై కప్పు పూర్తిగా లేచిపోయి వర్షానికి ఇంట్లో నిత్యావసర వస్తువులు,ఎలెక్ట్రానిక్ ఉపకరణాలు ధ్వంసమయ్యాయి.బాధిత కుటుంబం దిక్కు తోచని స్థితిలో పడింది. జూలురుపాడు పాపకొల్లు రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.కాంట్రాక్టర్ రోడ్డు ఎత్తు అనూహ్యంగా పెంచడంతో గృహాలు మొత్తం లోతట్టుగా మారాయి.వర్షం కారణంగా వరద నీరు బయటకు వెళ్ళే మార్గం లేక చెరువును తలపిస్తున్నాయి. మోకాళ్ల లోతు నీళ్లలో నాన ఇబ్బందులు పడుతున్నారు.పాపకొల్లు గ్రామంలో భారీ వృక్షం నేలకొరిగింది. డ్రైనేజీ లో ప్రవహించాల్సిన నీరు ప్రధాన రహదారి పై నది







ప్రవాహాన్ని తలపించింది.ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# మహిళా ఎస్సైపై కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం

**సత్తుపల్లి/పెనుబల్లి, -నవభూమి:** మద్యం మత్తులో ఓ హోటల్ వద్ద హంగామా సృష్టిస్తున్న ఓ కాంగ్రెస్ నాయకుడు, అతడి అనుచరులను అడ్డుకోబోయిన ఓ మహిళా ఎస్సైపై దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటన కల్లూరు పట్టణంలోని తిరువూరు క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. అయితే మహిళా ఎస్సైపై దురుసుగా ప్రవర్తించిన ఏడుగురిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన రాయల రామారావు(రాము) తన అనుచరులతో కలిసి కల్లూరు పట్టణంలోని చౌదరి హోటల్‌కు వచ్చాడు. తనకు టిఫిన్ కావాలని హోటల్ యజమాని మాగంటి బోసుబాబును అడగ్గా.. లేదని చెప్పడంతో ఆగ్రహంతో రాము, అతడి అనుచరులు హోటల్ యాజమాన్యం, సిబ్బందితో గొడవకు దిగారు. వెంటనే హోటల్ యజమాని కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. విచారణ నిమిత్తం ఎస్సై వెళ్తున్నారనే విషయం తెలుసుకున్న రాము తన అనుచరులతో మళ్లీ హోటల్ వద్దకు చేరుకున్నాడు. గొడవకు సాక్షులుగా ఉన్న హోటల్ సిబ్బంది, యజమానిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే హోటల్ నడవనివ్వనని బెదిరించాడు. ఈ క్రమంలో ఎస్సై తన సిబ్బందితో హోటల్ వద్దకు వెళ్లగా.. ఎస్సై ఎదురుగానే రాము, అతడి అనుచరులు మద్యం మత్తులో గొడవకు దిగారు.వారికి సర్ది చెప్పి కేసు విచారణ చేయాలనే ఉద్దేశంతో ఎస్సై వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేస్తున్న క్రమంలో రాము, అతడి అనుచరులు మహిళా ఎస్సై విధులకు ఆటంకం కలిగిస్తూ ఆమెపై చెయ్యి వేసి నెట్టివేశారు. దీంతో ఎస్సై ఫిర్యాదు మేరకు రాముతోపాటు మొత్తం 10 మందిపై కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు రాయల రామారావుతోపాటు ఏడుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. గతంలో కూడా రామారావుపై తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదైందని ఆయన పేర్కొన్నారు.విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్సై హరితపై కొందరు కాంగ్రెస్ నాయకులు మద్యం మత్తులో దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేయడం హేయమైన చర్య అని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఒక కేసు విషయమై ఘటనా స్థలానికి విచారణ కోసం వెళితే మద్యం మత్తులో ఉన్న స్థానిక ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు